క్లుప్తంగా

గోపాలపట్నం రైల్వే స్టేషన్‌లో కళాజాత



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గోపాలపట్నం: ఎయిడ్స్ నియంత్రణపై గోపాలపట్నం, సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆదివారం కళాకారులు కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాజాత నిర్వహిస్తున్నామని కళాకారులు తెలిపారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో కళాప్రదర్శనకు అనుమతిచ్చిన ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్‌వీఎస్ రావు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులు దేశభక్తి కలిగి ఉండాలి



ఐక్యత చిహ్నం చూపుతున్న చిన్నారులు

మల్కాపురం: చిన్నారులు మాతృదేశం పట్ల అభిమానాన్ని కలిగి ఉండాలని, దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడాలని విశ్రాంత జవాన్ ఆర్.శేషగిరిరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు దేశభక్తి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎవరు చేయాల్సిన పనిని వారు చిత్తశుద్ధి,అంకితభావం,నిజాయతీతో చేయడమే దేశ సేవ అని అన్నారు.సైన్యంలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ దేశం కోసం సేవలు అందించిన మహనీయుల జీవిత చరిత్రను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంచరపాలెం: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్ వాకర్స్ క్లబ్, శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ సంయుక్త అధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ద్వారకానాథ్ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జయతి ఉమా మహేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ పర్యవేక్షణలో వాకర్స్ క్లబ్ కుటుంబ సభ్యులు, స్థానికులు నేత్ర శిబిరాన్ని వినియోగించుకున్నట్లు కార్యదర్శి కాళ్ల వెంకట ప్రసాద్ తెలిపారు. సుమారు 232 మందికి ఉచిత సంపూర్ణ నేత్ర పరీక్షలు చేసి మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఉపాధ్యక్షుడు జె.రమేష్ కుమార్, కోశాధికారి సోండి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్, జాలీ వాకర్ ఏఎల్ నరసింహారావు, వైద్య సిబ్బంది, బోర్డు కో–ఆర్డినేషన్ సభ్యులు, క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితి ఏర్పడితే పవర్ కట్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక 220 కేవీ వి.ఎ స్.ఎస్, 220 కేవీ గంగవరం వి.ఎస్.ఎస్‌లలో విద్యుత్ ట్రాన్స్ మిషన్ లైన్ల ఆధునికీకరణలో భాగంగా అత్యవసర పరిస్థితి ఏర్పడితే జిల్లాలోని 4 ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ గాజువాక) బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈనెల 12 నుంచి జూన్ 26 వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరమ్మతులు చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. దీని కారణంగా వి.ఎస్.ఎస్. 220 కేవీ ఉపకేంద్రంలో సర్క్యూట్ విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే గాజువాక 220 కేవీ, మల్కాపురం 132 కేవీ, నేవల్ వార్ఫ్ 132 కేవీ, పోర్టు 132 కేవీ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.





- గుంతలమయంగా సర్వీసు రోడ్లు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- అవస్థలు పడుతున్న వాహనదారులు

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?

గాజువాక ఆర్టీసీ డిపో వద్ద సేవా మార్గం ఇలా..

నక్కవానిపాలెంలో సరిగ్గా పూడ్చని గుంతలు

మల్కాపురం: తమ అవసరాల కోసం గోతులు తవ్వారు.. అలా తవ్విన గోతులను సరిగ్గా పూడ్చకపోవడంతో పాదచారులు,వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

గతేడాది డిసెంబర్‌లో భూగర్భ పైపులైన్ వేసేందుకు 60వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టారు. గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా గల సేవా మార్గం నుంచి కోరమాండల్ మీదుగా నక్కవానిపాలెం, గాజువాక ఆర్టీసీ డిపో వరకు గల సేవా మార్గానికి ఓవైపు అడుగు విస్తీర్ణంలో గోతులు తవ్వారు. భూగర్భంలో పైపులైన్ అమర్చిన అనంతరం ఆ గోతులను సరిగ్గా పూడ్చలేదు. దీంతో ఆ సేవా మార్గం గుంతలు,గుంతలు గా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లోని మట్టిపై నీరు చేరి మరింత అధ్వానంగా మారాయి.దీంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆర్నెల్లు కావస్తున్నా..

సమస్య ఆర్నెల్ల నుంచి ఉన్నా అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రాత్రి వేళ, వర్షాలు కురిసే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

గోతులు సరిగ్గా పూడ్చకపోతే ఎలా..



వారి అవసరాల కోసం గోతులు తవ్వారు. పని పూర్తయిన తర్వాత గోతులను సరిగ్గా పూడ్చాల్సి ఉంది. మరి సరిగ్గా పూడ్చకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంత కాలంగా సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలి.

– నర్సింగరావు, వాహనదారు

అధికారులు స్పందించాలి



గుల్లపాలెం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు సర్వీసు రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షం పడితే ఆ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతుంది. గుంతలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. సమస్యపై అధికారులు స్పందించి గుంతలను సరిగ్గా పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వేణుగోపాలరెడ్డి, వాహనదారు



గుల్లలపాలెం వద్ద గోతులు ఇలా..

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని వంటా వార్పు చేసుకున్నారు. ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

దాహార్తి తీర్చడంలో మేము సైతం



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన టెంటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డుకు చెందిన ఎంఎంఆర్ మహిళా గ్రూప్ సభ్యులు సేవా కార్యక్రమానికి ముందుకు వచ్చారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడుతున్న వారి దాహార్తి తీర్చాలని ఆదివారం పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎన్ఎస్‌టీఎల్ నుంచి సింహాచలం వెళ్లే 80 అడుగుల దారిలో టెంటు ఏర్పాటు చేసి ప్రయాణికులకు మజ్జిగ అందిస్తున్నారు.

దశాబ్ద కాలంగా సేవలు

బాజీ జంక్షన్, సుసర్ల కాలనీలకు చెందిన మహిళా గ్రూప్ సభ్యులు ఎంఎంఆర్ గ్రూప్‌గా ఏర్పడి దశాబ్ద కాలంగా చేస్తున్న సేవలు ఎంతో మందికి బాసటగా నిలుస్తున్నాయి. ఏటా వేసవి కాలంలో రోజుకు సుమారు 400 మందికి మజ్జిగ పంపిణీ చేస్తూ దాహార్తి తీరుస్తున్నారు. అదేవిధంగా బిల్వపత్ర ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ప్రతి శని, సోమవారం నారాయణులకు (అన్నార్థులకు) అన్నప్రసాదాలు పంపిణీ చేస్తూ ఆకలి తీరుస్తున్నారు. భగవాన్ సత్యసాయి భక్త బృందంతో కలిసి సేవాకార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరి సేవలు మరెంతోమందికి స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడుతున్నారు.

మాతృమూర్తులను గౌరవిద్దాం



మాతృమూర్తిని సత్కరిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: మాతృ దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. ఆస్పత్రిలో తల్లులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలోని మాతృమూర్తి విగ్రహానికి అంజలి ఘటించారు. అనంతరం మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ ఏ జీవికైనా తల్లి అంకురమన్నారు. అమ్మ మనకు కనిపించే దైవమని.. ప్రతి ఒక్కరూ తల్లి దండ్రులను గౌరవించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడుతూ అమ్మ ప్రేమ ఉన్నతమైనదన్నారు. అధ్యక్షుడు గౌర పల్లి బంగార్రాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లులను బాగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గొరకల రామదాసు, ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం



కట్టా మల్లేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న పూర్ణచంద్రరావు

సీతంపేట: కులగణనతోనే బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు, ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం బీసీ సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్టా మల్లేశ్వరరావును బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించి నియామక పత్రం అందజేసి సత్కరించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జనాభాలో 60 శాతం బీసీ కులాలు ఉన్నప్పటికీ రాజకీయ, విద్య, ఉద్యోగాలలో తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. కులగణన జరిగితే జనాభా దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ పార్టీలకు అతీతంగా బీసీ సమస్యలపై పోరాటం చేస్తూ అన్ని కుల, ప్రజా సంఘాలను కలుపుకుని సమగ్ర కులగణన సాధించుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి, పోరాటం చేసిన అన్ని సంఘాలకు అభినందనలు తెలిపారు. కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధన ఎత్తివేయాలన్నారు. అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కేటాయించడం వల్ల జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు నష్టపోతున్నారని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై పునః సమీక్ష చేయాలని కోరారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలుకు బీసీ సమన్వయ కమిటీ పోరాటం చేస్తుందన్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడంరెడ్డి బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, రాష్ట్ర కోశాధికారి పొట్లూరి దేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లు రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగుల ఆంజనేయులు, పోచా రమేష్, ఓర్సు భాస్కర్, ఎర్రగుంట్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అల్లిపురం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు రౌడీషీటర్లను హెచ్చరించారు. జోన్–1 డీసీపీ ఎ.వేజెండ్ల పర్యవేక్షణలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రౌడీ షీట్ నమోదైన ప్రతి ఒక్కరూ సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ ఎర్రం నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్, శంకర్, సింహాచలం పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీ షీటర్లకు ఆదివారం సీఐ జీడీ బాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ లేదా నగర బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డబ్బులు కడితేనే ఎంట్రీ!

- నిర్వహణ పేరిట పార్కు కమిటీ వసూళ్లు
- జీవీఎంసీ ఉద్యోగులకు తప్పని భంగపాటు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సామాన్యులు



ఏపీఎస్ఈబీ కాలనీలోని పార్కు

విశాఖ విద్య: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన పార్కులోకి వెళ్లాలంటే ప్రవేశ రుసుము కట్టాల్సిందే. ఆదివారం రోజున కాసింత సేపు పార్కులో సేదతీరుదామనే వెళ్లే వారికి గుర్తింపు కార్డు ఉంటేనే లోపలికి అనుమతిస్తామని అడ్డగించడంతో సందర్శకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని అల్లూరి సీతారామరాజు పార్కులో కొన్ని రోజులుగా సందర్శకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. పార్కులోకి ప్రవేశించాలంటే తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాల్సిందేనని ఇక్కడి ప్రైవేటు సిబ్బంది తెగేసి చెబుతున్నారు. ఇందుకోసం నెలకు ఒక్కో వ్యక్తి నుంచి రూ.150 వసూలు చేస్తున్నారని, జీవీఎంసీ అభివృద్ధి చేసిన పార్కులో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వసూళ్లకు జీవీఎంసీ నుంచి అనుమతులు ఉన్నాయా.? అంటూ పలువురు నిలదీస్తున్నారు. అయినప్పటికీ ఇక్కడ ఉన్న ప్రైవేటు సిబ్బంది డబ్బులు కడితేనే లోపలికి పంపిస్తామని సందర్శకులను అడ్డగిస్తున్నారు. పర్సు తేలేదని కొంతమంది వృద్ధులు చెప్పినా, మా వద్ద ఫోన్ పే సదుపాయం కూడా ఉందని, ఆ విధంగానైనా డబ్బులు కట్టాలని తెగేసి చెబుతున్నారు.

వారెవ్వా..!

జీవీఎంసీ జోన్–8 పరిధిలో పనిచేసే కొంతమంది సిబ్బంది ఆదివారం పార్కుకు వెళ్లారు. వారిని సైతం అక్కడ ఉన్న ప్రైవేటు సిబ్బంది లోపలకి వెళ్లనీయకుండా అడ్డుగించారు. డబ్బులు కట్టి కార్డు తీసుకున్నవారు మాత్రమే పార్కులోకి ప్రవేశం ఉంటుందని చెప్పారు. తాము జీవీఎంసీ ఉద్యోగులమని చెప్పినా సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఎవరైనా సరే డబ్బులుకడితేనే పార్కులోకి పంపిస్తామని చెప్పడంపై జీవీఎంసీ సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. పార్కు లోపలకు వెళ్లేందుకు మరీ బలవంతంగా డబ్బులు వసూలు చేయడ మేంటని, ఈ విషయాన్ని సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సదరు ఉద్యోగులు 'సాక్షి'కి తెలిపారు.

తగ్గుతున్న సందర్శకులు

అల్లూరి పార్కులోకి ప్రవేశం కోసం డబ్బులు వసూలు చేస్తుండడంతో సందర్శకులు తగ్గిపోతున్నారు. పార్కులో ఉల్లాసంగా గడపడానికి వచ్చిన వారు డబ్బులు తీసుకురాకపోతే అనుమతించడం లేదు. దీంతో సమీపంలో ఉన్న పంచతత్వ పార్కుకు వెళ్లిపోతున్నారు. కాలనీ వాసుల కోసం జీవీఎంసీ నిధులతో పార్కు అభివృద్ధి చేస్తే, ఇది డబ్బులు కట్టే వారికే ఉపయోగపడుతుండటం వల్ల ఏం ప్రయోజనం చేకూరినట్లని పలువురు అంటున్నారు. పార్కు మెయింటెనెన్స్ కోసం ఇలాంటి చర్యలు అవసరమే అయినా, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలే తప్పా వచ్చినవారంతా డబ్బులు కట్టాల్సిందేనని తెగేసి చెప్పడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

సందేశాత్మకంగా బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు



వేణునాదం చేస్తున్న భరద్వాజ

పెందుర్తి: స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, ఉత్తరాంధ్ర ధ్యాన మాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు రెండో రోజు ఆదివారం సందేశాత్మకంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రాతఃకాల ధ్యానం చేశారు. అనంతరం గాయత్రి విభావరి మృదంగం, కోలాటం ఆకట్టుకున్నాయి. బాజీ జంక్షన్‌కు చెందిన శైలపతి భరద్వాజ ఆధ్వర్యంలో వేణు నాదం సాగుతుండగా ఆహుతులు సామూహిక ధ్యానం చేశారు. పి.అన్నపూర్ణ, దివ్యగంధ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. శ్రీకాకుళానికి చెందిన స్వాతి సోమనాథ్ బృందం ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ధ్యాన మాస్టర్లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సోమవారంతో ధ్యానోత్సవాలు ముస్తాయని నిర్వాహకులు తెలిపారు.

వ్యర్థాలమయం



జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి పైడిమాంబకాలనీలో పరిసరాలు అధ్వానంగా మారాయి. టిడ్కో ఇళ్లకు ఆనుకుని ఉన్న రోడ్లు, కాలువలు అపరిశుభ్రంగా ఉండడంతో నిత్యం ముక్కుమూసుకునే పరిస్థితి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు, కాలనీ రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతో విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పబ్లిక్ హెల్త్ అధికారులు పర్యవేక్షించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– కంచరపాలెం

కొనసాగుతున్న వాటర్ బాటిళ్ల పంపిణీ



జనరల్ బోగీ ప్రయాణికులకు మంచినీరు పంపిణీ చేస్తున్న స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మిట్ట మధ్యాహ్నం దువ్వాడ వచ్చే రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ కొనసాగుతోంది. ఆదివారం స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు వాటర్ పంపిణీ చేశారు. 11 రోజులుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. జనరల్ బోగీలు, మహిళలు, దివ్యాంగుల బోగీల్లోని ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఈవూరి బుచ్చిరాజు, ప్రతినిధులు సీతారామరాజు, నాథ్, లత, సరోజిని, శ్రావణి, జ్యోతి, రమ, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.